ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :174 ఆదివారం ఏప్రిల్ 19 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


## డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త దందా

- పార్శిల్ స్కామ్ పట్ల ప్రజలు జాగ్రత్త!
- కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపులు
- భయాందోళనకు గురిచేసి లక్షలాది రూపాయల వసూళ్లు
- అపరిచిత వీడియో కాల్స్ వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి






ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త పంథాలో అమాయక ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. ముఖ్యంగా 'కొరియర్ పార్శిల్ స్కామ్' పేరుతో సామాన్యులను భయ భ్రాంతులకు గురిచేస్తూ లక్షలాది రూపాయలు కాజేస్తున్నారు. మీ పేరుతో వచ్చిన పార్శిల్‌లో నిషేధిత డ్రగ్స్ లేదా పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని, దీనివల్ల మీరు చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని ఫోన్ కాల్స్ ద్వారా నమ్మిస్తున్నారు. ఈ క్రమంలో బాధితులు భయపడగానే, తాము క్రైమ్ బ్రాంచ్ లేదా నార్కోటిక్స్ అధికారులమని చెప్పుకుంటూ వీడియో కాల్స్ ద్వారా 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నట్లు డ్రామా ఆడుతున్నారు. నేరగాళ్లు ఫెడెక్స్ లేదా ఇతర ప్రముఖ కొరియర్ సంస్థల ప్రతినిధులమని పరిచయం చేసుకుంటూ బాధితులకు ఫోన్ చేస్తున్నారు. తైవాన్ లేదా ఇతర దేశాలకు వెళ్తున్న మీ పార్శిల్‌ను కస్టమ్స్ అధికారులు ఆపేశారని, అందులో ఎండీఎంఏ వంటి మత్తు పదార్థాలు ఉన్నాయని బెదిరిస్తున్నారు. కేసు నుంచి బయటపడాలంటే విచారణ పేరుతో తాము చెప్పే బ్యాంక్ ఖాతాలకు డబ్బులు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. గంటల తరబడి వీడియో కాల్‌లోనే ఉంచి, బాధితులు ఎవరినీ సంప్రదించకుండా మానసిక ఒత్తిడికి గురిచేయడం వీరి ప్రధాన వ్యూహంగా మారుతోంది. పోలీసుల హెచ్చరిక ప్రకారం, ఏ ప్రభుత్వ సంస్థ లేదా దర్యాప్తు సంస్థ వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపదు లేదా డబ్బులు డిమాండ్ చేయదు. 'డిజిటల్ అరెస్ట్' అనే ప్రక్రియ చట్టంలోనే లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వెంటనే ఫోన్ కట్ చేయాలని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని సూచిస్తున్నారు. నేరగాళ్లు పంపే లింక్‌లపై క్లిక్ చేయడం లేదా వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటివి చేయరాదని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నారు. సైబర్ కేటుగాళ్లు తమను నమ్మించేందుకు పోలీసు స్టేషన్ సెటప్ ఉన్న గదుల నుంచి వీడియో కాల్స్ చేస్తూ, పోలీస్ యూనిఫామ్ ధరించి కనిపిస్తున్నారు. స్కామ్ మొదలవ్వగానే బాధితుడి గుర్తింపు కార్డు వివరాలు చెప్పి వారిని నమ్మిస్తున్నారు. ఒకసారి డబ్బు పంపిన తర్వాత మరిన్ని కారణాలు చెబుతూ బాధితులను పూర్తిగా దోచుకుంటున్నారు. విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం ఈ తరహా మోసాలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వాట్సాప్, స్కైప్ వంటి యాప్స్ ద్వారా ఈ విచారణ నాటకం నడిపిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఇటువంటి మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు. మీ ఫోన్ నంబర్‌కు వచ్చే అపరిచిత కాల్స్ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండటమే ఇటువంటి నేరాల నుంచి రక్షణ అని వారు పేర్కొంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రకటనలు, లాటరీల పేరుతో వచ్చే సందేశాలను కూడా నమ్మవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అరైవ్-అలైవ్ సదస్సుతో... రోడ్డు భద్రతపై అవగాహన



- కరీంనగర్‌లో ప్రజా పాలన కార్యక్రమం
- డీజీపీ శివధర్ రెడ్డి కీలక సూచనలు
- డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

కరీంనగర్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన "అరైవ్అలైవ్" రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారుఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ వాహనదారులు ఎల్లప్పుడూ డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించాలని సూచించారు. రోడ్డు పరిస్థితులు, ఇతర వాహనాల కదలికలను ముందుగానే అంచనా వేసుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. సురక్షిత ప్రయాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని డీజీపీ సూచించారు.



## నైట్ ప్యాంటుతో విధులకు హాజరు.. ఉద్యోగిపై సస్పెన్షన్ ఆదేశాలు



- బాపట్ల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- డ్రెస్ కోడ్ ఉల్లంఘనపై ఆగ్రహం
- పెండింగ్ అర్జీలపై తీవ్ర అసంతృప్తి

బాపట్ల, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): స్థానిక సచివాలయంలో నైట్ ప్యాంటుతో విధులకు హాజరైన డిజిటల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ డా. వి. వినోద్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 5వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విధుల్లో ఉన్న ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక ఉద్యోగి నిబంధనలకు విరుద్ధంగా నైట్ ప్యాంటుతో విధులకు రావడాన్ని గమనించారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రభుత్వ ఉద్యోగులు డ్రెస్ కోడ్‌ను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. వెంటనే ఆ ఉద్యోగిని సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక సచివాలయంలో గడువు తీరిన 11 అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై కూడా అసహనం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. పౌర సేవలను వేగవంతంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పనితీరు మెరుగుపర్చాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ ద్వారా సచివాలయాల పనితీరుపై కఠిన నిఘా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

- పిల్లల సంక్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- వడ్డెరా బస్తిలో పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్యపై సమగ్ర పరిశీలన
- బాలసదనం, శిశుగృహాల్లో సదుపాయాల సమీక్ష
- పిల్లల ఆరోగ్యం, అభివృద్ధిపై కఠిన ఆదేశాలు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): జిల్లా కేంద్రంలోని వడ్డెరా బస్తి అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవల అమలుపై సమగ్రంగా పరిశీలించారు. అంగన్వాడీ కార్యకలాపాల నాణ్యత, పిల్లలకు అందుతున్న సేవల ప్రమాణాలపై అధికారులు వివరాలు అందించగా, వాటిని కలెక్టర్ సవివరంగా పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులతో కలిసిమెలిసి మాట్లాడిన కలెక్టర్, వారి పఠన, వ్రాత సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు.

2

## అయోధ్య విమానాశ్రయంలో... ఉగ్రవాద నిరోధక మాక్ డ్రిల్



- భద్రతా వ్యవస్థల సిద్ధతపై సమగ్ర పరీక్ష
- బహుళ సంస్థల సమన్వయానికి ప్రాధాన్యం
- విమానాశ్రయ భద్రతలో మరింత బలోపేతం

అయోధ్య, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య విమానాశ్రయంలో ఉగ్రవాద ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కౌంటర్ టెర్రరిస్ట్ కాంటింజెన్సీ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. భద్రతా వ్యవస్థల సిద్ధతను పరీక్షించడంతో పాటు, వివిధ సంస్థల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ మాక్ డ్రిల్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ క్విక్ రెస్పాన్స్ టీమ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌తో పాటు ఆంటీ టెర్రరిజం స్క్వాడ్, స్థానిక పోలీసులు, రాష్ట్ర బాంబ్ డిస్పోజల్ బృందాలు, ఎయిర్‌లైన్స్ సిబ్బంది, అగ్నిమాపక, వైద్య విభాగాలు పాల్గొన్నారు. అదనంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మరియు ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి కీలక సంస్థలు కూడా భాగస్వామ్యం కావడంతో ఈ డ్రిల్ మరింత సమగ్రంగా సాగింది. అన్ని విభాగాలు కలిసి పనిచేస్తూ అత్యవసర

2

# అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

మెదటి పేజీ తరువాయి



పిల్లలు చదువుతున్న విధానం, ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరు, తరగతి గది వాతావరణం వంటి అంశాలను గమనించి పలు సూచనలు చేశారు. పిల్లలకు అందుతున్న పోషకాహారం నాణ్యత, సమయపాలన, సరఫరా వ్యవస్థలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి చిన్నారి శారీరక, మానసిక అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం బాలసదనం, శిశు గృహాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడి నివాస వసతులు, భోజన నాణ్యత, వైద్య సేవలు, శుభ్రత పరిస్థితులను సమీక్షించారు. పిల్లల ఆరోగ్య రికార్డులు, టీకాలు, వైద్య పరీక్షల వివరాలను పరిశీలించి, ఎలాంటి లోపాలు లేకుండా సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రత్యేకించి చిన్నారుల సంరక్షణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల అభివృద్ధికి కీలక కేంద్రాలుగా ఉండాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండాలని తెలిపారు. ప్రీ-స్కూల్ విద్యను ఆకర్షణీయంగా, ఫలితాల దృష్ట్యా బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ, ఆరోగ్య, విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారి వరకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లల తల్లిదండ్రులతో కూడా సమన్వయం పెంచి, వారి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమగ్ర పర్యవేక్షణతో సేవల నాణ్యతను పెంచాలని అన్నారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పిల్లల సంక్షేమంపై ఎప్పటికప్పుడు తనిఖీలు కొనసాగిస్తామని, ఎక్కడైనా లోపాలు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. చిన్నారుల భవిష్యత్తు బలపడేలా సమిష్టి కృషి అవసరమని ఆమె పేర్కొన్నారు

# అయోధ్య విమానాశ్రయంలో ఉగ్రవాద నిరోధక మాక్ డ్రిల్

మెదటి పేజీ తరువాయి



పరిస్థితుల్లో స్పందన ఎలా ఉండాలో ప్రదర్శించాయి. ఉగ్రవాద పరిస్థితులను అనుకరించి నిర్వహించిన ఈ వ్యాయామంలో, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, ప్రయాణికుల రక్షణ, పేలుడు పదార్థాల నిర్వీర్యం, అత్యవసర వైద్య సహాయం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా బహుళ సంస్థల మధ్య సమన్వయం, వేగవంతమైన స్పందన, భద్రతా ప్రమాణాల అమలును అధికారులు సమీక్షించారు. ఎలాంటి ప్రమాద పరిస్థితుల్లోనైనా సమర్థవంతంగా స్పందించే సామర్థ్యాన్ని ఈ వ్యాయామం ద్వారా అంచనా వేశారు. విమానాశ్రయ భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ తరహా మాక్ డ్రిల్లులు కీలకమని అధికారులు పేర్కొన్నారు. కీలక మౌలిక వసతులను రక్షించడంలో అప్రమత్తత, సమన్వయం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

# విజయవాడ నుంచి హజ్ యాత్రికులకు ఘన వీడ్కోలు

- మంత్రి, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు
- మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం
- 353 మంది యాత్రికులు విజయవాడ నుంచి ప్రయాణం







విజయవాడ, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతున్న ముస్లిం మైనార్టీ సోదరులకు ఘనంగా వీడ్కోలు పలికారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్, ఎమ్మెల్యే నజీర్, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్తో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, పచ్చ జెండా ఊపి హజ్ యాత్రను ప్రారంభించారు. జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనేది ప్రతి ముస్లిం సోదరుడి కల అని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి యాత్రను సులభతరం చేయడం అభినందనీయమని తెలిపారు. మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొత్తం 1987 మంది హజ్ యాత్రకు బయల్దేరగా, విజయవాడ నుంచి 353 మంది వెళ్లడం విశేషమని పేర్కొన్నారు. యాత్ర సురక్షితంగా, విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. మైనార్టీ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మత పెద్దలు, యాత్రికుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ప్రతిపాదన

- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- హైదరాబాద్‌ను జాతీయ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే వ్యూహం
- ఈవీ, హైడ్రోజన్, రోబోటిక్స్ రంగాల్లో భారీ ప్రణాళికలు



ఢిల్లీ, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): తెలంగాణను దేశ పారిశ్రామిక రంగంలో అగ్రస్థానానికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిను ఢిల్లీలో కలిసి బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కూడా పాల్గొన్నారు. తెలంగాణరైజింగ్ విజన్‌లో భాగంగా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను సీఎం కేంద్రానికి సమర్పించారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల దేశంలో పెరుగుతున్న ఉక్కు అవసరాలను తీర్చడమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని సీఎం వివరించారు. సంప్రదాయ ఉక్కు పరిశ్రమల వల్ల ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని తగ్గిస్తూ, హైడ్రోజన్ ఆధారిత సాంకేతికతతో గ్రీన్ స్టీల్ ఉత్పత్తి చేయడం ద్వారా సుస్థిర అభివృద్ధికి దోహదం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలు అయితే తెలంగాణ మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో పాత వాహనాల స్క్రాప్‌ను ఉపయోగించి ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ చర్యల ద్వారా వ్యర్థాలను తగ్గించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ఉత్పత్తిలో హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే సామర్థ్యం రాష్ట్రానికి ఉందని, ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, నైపుణ్యాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీ ఆధారంగా గ్రీన్ స్టీల్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఆటోమొబైల్, రక్షణ రంగాలకు అవసరమైన అధునాతన ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరమని, దీనివల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తాయని వివరించారు. మెషిన్ టూల్స్, రోబోటిక్స్, ఆటోమేషన్ రంగాల్లో తెలంగాణను హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి కోసం జాతీయ స్థాయి శిక్షణ సంస్థలను హైదరాబాద్‌లో స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా యువతకు అత్యాధునిక సాంకేతిక విద్య అందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తయారుచేయవచ్చని తెలిపారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా మార్చే లక్ష్యంతో పర్యావరణ హిత విధానాలను అమలు చేయాలని సీఎం సూచించారు. వాహనాలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం, శుభ్రమైన ఇంధన వినియోగాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక వృద్ధి ఈ మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ముందుకు తీసుకెళ్లే ప్రణాళికలను కేంద్రానికి వివరించారు. ఈ సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రతిపాదనలు కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు

# భారత్-రష్యా రక్షణ ఒప్పందం

- సైనిక సహకారానికి కొత్త దిశ
- ఇరు దేశాల్లో పరస్పర సైనిక మోహరింపుకు అనుమతి
- విమానాలు, యుద్ధ నౌకల వినియోగానికి మార్గం
- రక్షణ రంగంలో వ్యూహాత్మక బంధం బలోపేతం





న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): భారత్‌రష్యా మధ్య రక్షణ రంగంలో కీలక ముందడుగు పడింది. తాజా ఒప్పందం ప్రకారం ఇరు దేశాలు పరస్పరం తమ భూభాగంలో గరిష్ఠంగా 3,000 మంది సైనికులను మోహరించుకునే వీలును కల్పించాయి. ఇది సంప్రదాయ రక్షణ సంబంధాలకంటే ముందుకు వెళ్లిన కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఒకేసారి గరిష్ఠంగా 10 సైనిక విమానాలు, 5 యుద్ధ నౌకలను కూడా పరస్పరం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్, మోహరింపు విధానాలు వంటి అంశాలను కూడా ఈ ఒప్పందం కవర్ చేస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత వ్యవస్థీకృతంగా మారనుంది. భారత్ రష్యా మధ్య ఇప్పటికే బలమైన రక్షణ సంబంధాలు ఉన్నప్పటికీ, ఈ ఒప్పందం వాటిని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు. సంయుక్త వ్యాయామాలు, సాంకేతిక మార్పిడి, ఆయుధ వ్యవస్థల అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం మరింత విస్తరించనుంది. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇరు దేశాలకు ఇది సహకరించనుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ఒప్పందం ద్వారా భారత్ తన రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోగలదని, ప్రపంచ వ్యాప్తంగా వ్యూహాత్మక స్థానం మరింత దృఢంగా మారుతుందని విశ్లేషిస్తున్నారు. ఇదే సమయంలో రష్యాతో ఉన్న సుదీర్ఘ సంబంధాలకు ఇది కొత్త అధ్యాయాన్ని తెరుస్తుందని పేర్కొంటున్నారు.



# గృహనిర్బంధంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్‌పై విమర్శలు
- ముఖ్యమంత్రి నివాస ముట్టడి పిలుపు నేపథ్యంలో ఉద్రిక్తత
- నారీశక్తిని అణచలేరని హెచ్చరిక



హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): అక్రమ గృహనిర్బంధాలతో మహిళల ఆగ్రహాన్ని అణచివేయలేరని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్, ఇండీ కూటమి వైఖరిని ఆయన తప్పుబట్టారు. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ చిత్తశుద్ధితో తీసుకువచ్చిన బిల్లును అడ్డుకోవడం మహిళా వ్యతిరేక ధోరణికి నిదర్శనమని అన్నారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నివాస ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు తనను గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని 3

# గృహనిర్బంధంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఆగ్రహం

తరువాయి భాగం



విమర్శించారు.పోలీసు నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో మహిళా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం సరికాదని ఆయన హెచ్చరించారు. నారీశక్తి తమ హక్కుల సాధన కోసం మరింతగా పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, మహిళల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# పెద్దలింగాపూర్ ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నియామకం



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 18 ఏప్రిల్ :పెద్ద లింగాపూర్ ఉప మండల కేంద్రం లోని దుబ్బ రాజరాజేశ్వర దేవాలయం ఆవరణలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహణ కోసం వివిధ గ్రామాల నుండి వచ్చిన సభ్యుల సమావేశం లో ఖండ జాగరణ సమితి సభ్యులు బత్తిని ఆంజనేయులు,కాసుపాక కిషన్,పాల్గొన్నారు.ఈ నిర్వహణ సమావేశం లో ఉప మండలంలోని 9 గ్రామాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హిందూ సమ్మేళనం నిర్వహణ నిమిత్తం హిందూ సమ్మేళన నిర్వహణ సమితిని ఏర్పాటు చేశారు. పెద్ద లింగాపూర్ ఉప మండల హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులుగా పండుగ లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శిగా కరికే నవీన్ కుమార్,కోశాధికారి కంకటి శ్రీకాంత్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు పండుగ లక్ష్మణ్ హిందూ సమ్మేళన సమితి ఉపాధ్యక్షులను,కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను నియామకం చేశారు.హిందూ సమ్మేళన కార్యక్రమం ఈ నెల 26 తేదీ న ఆదివారం రోజున సాయంత్రం 5 గంటలకు దుబ్బ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో సమ్మేళనం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమ్మేళనానికి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు

# మున్సిపల్ సమావేశంలో సమస్యల పై ప్రస్తావించిన వల్లపుదాసు కృష్ణ



మనప్రజాప్రతినిధి// హుజూర్ నగర్: హుజూర్ నగర్ మున్సిపల్ కార్యాలయం లో శనివారం రోజున సాధారణ మున్సిపల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో 19 వ వార్డ్ కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ మాట్లాడుతూ వార్డ్ లో నెలకొన్న నీటి సమస్యలు మరియు ఎండాకాలం లో ప్రజలకు నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అలాగే మున్సిపల్ లే అవుట్లు కాపాడాల్సిన మనందరి బాధ్యత అంటూ సమావేశంలో గుర్తు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన వారు రిజిస్ట్రేషన్ చేయించుకోలేక అగ్రిమెంట్ పేపర్ పై రాయించుకున్న వారికి కూడా ఇంటి నెంబర్ కేటాయించాలని కోరారు. వార్డులో మిగిలి ఉన్న సి సి రోడ్లను పూర్తి చేయడానికి కృషి చేద్దాం అని చెప్పారు. వార్డు లలో నెలకొన్న వీధి కుక్కల బెడద వీలైనంత త్వరగా తొలగించాలి అని మున్సిపల్ అధికారులను కోరారు.

# రాముడిపై ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



పాలక వీడు (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )హిందువులు దేవుడిగా కొలిచే రాముడిపై చలన చిత్ర నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు వ్యాఖ్యానించారు శనివారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడులో విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో.... దేవుడు అనేది మతం అనేది వ్యక్తిగత విషయమని ఏ మతాన్ని ఏ దేవుడినీ విమర్శించే హక్కు ఎవరికీ లేదని ప్రజలు తమకు నచ్చిన దేవుడిని మతాన్ని ఆరాధిస్తారని అది వారు హక్కు అని ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొంది భారతీయుల ఆరాధ్య దైవమైన రాముడు పట్ల వెకిలి మాటలు మాట్లాడడం సరి కాదని రాముడు వలసవాది అని రావణాసురుడి తోటలో పండ్లు దొంగిలించాడని ఇంత దిగజారుడు స్థాయి మాటలు మాట్లాడటం తగదని హిందూ దేవుళ్ళ పట్ల ఇలాంటి అభిప్రాయాలు కలిగిన వారిని చట్టాలు శిక్షించాలని ఎవరిదో మెప్పుకోసం మెహర్బానీ కోసం రాముడిని అవమానించాలని ప్రయత్నించడం క్షమించరాని నేరం అని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పురావృత కాకుండా ప్రకాశరాజ్ ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క ప్రకాష్ రాజ్ ని మాత్రమే కాదు పరమత సహనం కోల్పోయి మతాల మధ్య వైరుధ్యాలు పెంచి మతాన్ని రాజకీయం కోసం వాడుకునే ప్రతి ఒక్కరిని సమాజం దూరంగా ఉంచాలని ప్రజాహితం కోరుకునే వారు సమాజ హితం కోరుకునేవారు సర్వమతాల పట్ల సహనం పాటించాలని ఆయన కోరారు

# నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత



హుజూర్నగర్ (మన ప్రజాప్రతినిధి దినపత్రిక )హుజూర్ నగర్ పట్టణంలోని తిలక్ నగర్ 15వ వార్డు వార్డుకు చెందిన పేద విద్యార్థిని నిమిషకవి కీర్తన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ప్రభుత్వ మహాత్మా జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో చదివిన రాష్ట్రస్థాయిలో 440/436 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచిన శుభ సందర్భంలో శనివారం మున్సిపల్ కార్యాలయం లోలిమున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. 14 వ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు, 15 వార్డు కౌన్సిలర్ నల్లగొండ సుజాత చంటి ఆధ్వర్యంలో కీర్తనలను మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ కు పరిచయం చేశారు ఈ సందర్భంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో అతి కష్టమైన బైపిసి లో 440 మార్కులకు గాను 436 మార్కులు సాధించి నందుకు ఎంతో గర్వకారణం అని అన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో మున్సిపల్ కౌన్సిలర్లు దగ్గుపాటి కవిత బాబురావు, నల్లగొండ సుజాత చంటి ముందు ఉన్నారని వారి కుటుంబాలకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తారని చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో కూడా కీర్తన మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ప్రమాదంలో చనిపోయిన వారి ఆశయాలకు అనుగుణంగా చదువుతూ డాక్టర్ గా చదివి పేదలకు సహాయం చేయాలని కీర్తనలు సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పాలకవర్గం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్.ఫ్లోర్ లీడర్ సంపత్ రెడ్డి. జక్కుల మల్లయ్య. బెల్లంకొండ శీను బొల్లెద్దు ధనమ్మ సులువ నాగలక్ష్మి. దొంతి రెడ్డి పద్మ బెల్లంకొండ సంధ్య. చిన్న పంగు సావిత్రి చిట్టి పోతుల భద్రమ్మ కోళ్ల ఉదయభాను. అమరారపు ప్రవీణ్. వల్లభ దాస్ కృష్ణ మరియు తదితరులు పాల్గొనడం జరిగింది

# మంత్రి నారా లోకేష్ అండతో చిన్నారి పునర్వికకు పునర్జన్మ

- అరుదైన ఎస్ఎంఏ టైప్1 వ్యాధికి జీన్ థెరపీ చికిత్స
- అమెరికా నుంచి తెప్పించిన కీలక ఇంజెక్షన్
- హైదరాబాద్‌లో విజయవంతంగా వైద్య సేవలు





హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ టైప్1 వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్వికకు మంత్రి నారా లోకేష్ అండగా నిలిచి ప్రాణాలను కాపాడిన సంఘటన హృదయాలను కదిలిస్తోంది. అత్యంత ఖరీదైన జీన్ థెరపీ చికిత్స కోసం అవసరమైన ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి ప్రత్యేకంగా రప్పించడంలో మంత్రి కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్లో వైద్యులు "జోల్‌జెన్‌స్మా" అనే జీన్ థెరపీ ఇంజెక్షన్‌ను చిన్నారికి విజయవంతంగా అందించారు. ఈ ప్రక్రియ మంత్రి లోకేష్ సమక్షంలో జరిగింది. ఈ చికిత్స ద్వారా పునర్విక ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు.చికిత్స అనంతరం మంత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిన్నారి ప్రాణాలు నిలవడంలో సహకరించినందుకు కుటుంబ సభ్యులు లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లక్షలాది మంది ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఈ చికిత్స సాధ్యమైందని మంత్రి పేర్కొన్నారు. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వంటి అరుదైన వ్యాధులు చిన్నారుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో, ఈ తరహా జీన్ థెరపీ చికిత్సలు ఆశాకిరణంగా మారుతున్నాయి. అయితే ఈ చికిత్స ఖరీదు ఎక్కువగా ఉండటం వల్ల సాధారణ కుటుంబాలకు అందుబాటులో ఉండడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో ఇలాంటి చిన్నారులకు సహాయం అందించడం అత్యవసరమని వైద్యులు సూచిస్తున్నారు. పునర్విక కోలుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ప్రార్థిస్తున్నారు

# "ప్రజాసేవే లక్ష్యం నాలుగేళ్లలో వేలాది జీవితాల్లో వెలుగు నింపిన సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్"



(మన ప్రజా ప్రతినిధి ఏప్రిల్ 18):రాయపోల్, ఏప్రిల్ 18:సామాజిక సేవ లక్ష్యంగా పనిచేస్తున్న సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ నాలుగు సంవత్సరాల సేవా ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ మాట్లాడుతూ, "ప్రజాసేవ చేయడమే సోషల్ రిఫార్మేషన్ లక్ష్యం" అని పేర్కొన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా ఫౌండేషన్ అనాథలు, నిరుపేదలు, అవసరమైన కుటుంబాలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పేద కుటుంబాలకు ఆహారం, బియ్యం అందించడం, ఆడపిల్లల విద్యకు తోడ్పాటు, పెళ్లి సహాయం వంటి కార్యక్రమాలు చేపట్టింది.అలాగే అనాథ పిల్లలకు అండగా నిలిచి, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూతనిస్తూ సమాజంలో విశ్వాసాన్ని పెంచుతోంది. నిస్వార్థ సేవతో ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఈ సంస్థకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

# మాలల జనాభా తగ్గించి చూపించేందుకు కుట్రలు కరికే శ్రీనివాస్ఆరోపణ



మన ప్రజాప్రతినిధి రాయపోల్:రాష్ట్రంలో మాలల జనాభాను కావాలనే తక్కువగా చూపిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి కుట్రలు జరుగుతున్నాయని మాలల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరికే శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీల వర్గీకరణ కారణంగా మాలలకు విద్యా, ఉపాధి అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన సర్వేలో కూడా మాలల పట్ల వివక్షత స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 17 లక్షలకు పైగా ఉన్న మాలల సంఖ్య, తాజా సర్వేలో 14 లక్షలకు తగ్గిపోవడం వెనుక ప్రభుత్వ ఉద్దేశపూర్వక వైఖరి ఉందని అనుమానం వ్యక్తం చేశారు.మాల ఉపకులాలను విడదీసి లెక్కించడం వల్ల అసలు జనాభా తగ్గించి చూపించే ప్రయత్నం జరిగిందని అన్నారు. నేతకాని, మాలసాలే, మాల బైండ్ల వంటి ఉపకులాలను వేరు చేసి ఇతర గ్రూపుల్లో చేర్చడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సర్వే శాస్త్రీయంగా జరగలేదని, వెంటనే రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మాలల జనాభా నాల్గవ స్థానంలో ఉండాల్సి ఉండగా, తాజా గణనలో ఏడవ స్థానానికి పడిపోయిందని, ఇది సరైన గణాంకం కాదని అన్నారు. రెడ్డి, గౌడ్ కులాల కంటే మాలల సంఖ్య తక్కువగా చూపించడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో కొంతమంది మాలలు అభివృద్ధి సాధిస్తే అగ్రవర్ణాలు సహించలేకపోతున్నాయని, ఇంకా మెజారిటీ మాలలు వెనుకబడి అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు వేగం

హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు.శనివారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ అధికారులు, ఏవియేషన్ శాఖ ప్రతినిధులతో కలిసి మంత్రి ఈ ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపిరి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను త్వరగా సిద్ధం చేయాలని, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉత్తర తెలంగాణలో రవాణా సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని

## 25 సంవత్సరాల దరువు వార్షికోత్సవ జాతరను విజయవంతం చేద్దాం
### ఈ నెల 20 న రవీంద్ర భారతిలో ఘనంగా సంబరాలు
### దరువు అంజన్న,దరువు ఎల్లన్న



(మన ప్రజా ప్రతినిధి ఏప్రిల్ 18 రాయపోల్):రాయపోల్ మండల కేంద్రంలో ఈనెల 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ఉత్సవాలను జయప్రదం చేయాలని దరువు కళా స్ఫూర్తి 25 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ జాతర జరగనుందని ఇట్టి సభను విజయవంతం చేయాలని రాయపోల్ అంబేద్కర్ చౌరస్తాలో కళాకారుడు తుడం స్వామి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ను రిలీజ్ చేయడం జరిగింది.రవీంద్ర భారతిలో ఆట పాట లతో ఘనంగా సంబరాలు జరుగుతాయని తెలంగాణ మలి దశ ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది కళాకారులతో తిరిగి ఈ నెల 20 న స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని ఈ సభను విజయవంతంగా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో భాగన్నగారి రవీందర్ రెడ్డి మాసంపల్లి కనకయ్య, మాసంపల్లి యాదగిరి, సంఘం నరేష్ ,గుని ప్రభాకర్ , గూని కుమార్, ఇంద్రకరణ్, లక్ష్మణ్, ఉషనగళ్ళ ఎల్లం ,విజయ్ సంతోష్ ,తదితరులు పాల్గొన్నారు

## నేరేడుచర్ల లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆల్పాహార పంపిణీ కార్యక్రమం



నేరేడుచర్ల (మన ప్రజాప్రతినిధి దినపత్రిక)నేరేడుచర్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు భువనగిరి అంజయ్య మరియు కళావతి దంపతుల ఆర్థిక సౌజన్యంతో వారి కుమార్తె భువనగిరి నీరజ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గుండ్రెడ్డి సైదిరెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సమాజానికి సేవ చేయడం తమ ప్రధాన లక్ష్యమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అలాగే సుమారు 300 మందికి అల్పాహారం ఏర్పాటు చేసిన భువనగిరి అంజయ్య, కళావతి దంపతులను అభినందిస్తూ, వారి కుమార్తె నీరజకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్బు ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ భట్టు మధు, ఎడవల్లి సత్యనారాయణ రెడ్డి, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు సుంకర క్రాంతి కుమార్, రాచకొండ శ్రీనివాస్ రావు, కందిబండ శ్రీనివాసరావు, బనావత్ సైదులు, బాలు, బాలేన సైదులు, బాల వెంకటేశ్వర్లు, గంధం శివయ్య, మూలగుండ్ల వెంకటరెడ్డి, బసవకోటి, వల్లూరి శ్రీనివాసరావు, బొబ్బర్ల పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బైక్ లు ఢీకొని వ్యక్తి మృతి....
### శవాన్ని ఇంటి ముందు ఉంచి కుటుంబీకులు ఆందోళన



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 18:చేగుంట మండలం వడియారం గ్రామ శివారులో జి కే ఆర్ కంపెనీ సమీపంలో శుక్రవారం రాత్రి రెండు బైకులు ఢీకొనగా కామారం పెద్దతండకు చెందిన మూడవత్ కుమార్ (30) అక్కడికక్కడే చనిపోయినాడు మరో బైకు వ్యక్తికి గాయాలు కాగా తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు, శవాన్ని ఇంటి ముందు ఉంచి కుటుంబీకులు ఆందోళనకుమార్ కుటుంబీకులు చేగుంట పట్టణ కేంద్రం లో గల ఎన్ జి ఓ కాలనిలో ఉంటున్న మీర్జాపల్లి గ్రామానికి చెందిన రాజు, తమ వ్యవసాయం పొలం ఒక కోటి 85 లక్షలకు కొనగా, ఇంకా తమకు రావాల్సిన 85లక్షల డబ్బు కోసం చేగుంటకు వచ్చారని దీనికి కారణం రాజు అని కుటుంబీకులు ఆగ్రహించి రాజు ఇంటి ముందు శవాన్ని ఉంచారు, విషయం తెలుసుకున్న చేగుంట ఎస్సై చైతన్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలతో మాట్లాడి కుమార్ కి రావాల్సిన 85 లక్ష రూపాయలు మూడు నెలల వరకు ఇస్తామని ఒప్పుకోవడంతో, శాంతించారు, కుమార్ శవాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులు అప్పజెప్పారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

- దక్షిణాది రాష్ట్రాల మద్దతు కోసం ముందుకు వస్తానన్న సీఎం
- డీలిమిటేషన్ పేరుతో కుట్రలు చేస్తున్నారని బీజేపీపై ఆరోపణలు
- మహిళా సాధికారతపై కాంగ్రెస్ కట్టుబాటు పునరుద్ఘాటన



ఢిల్లీ, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): మహిళా రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత వ్యాఖ్యలు చేశారు. 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలోపు మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తే తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడాన్ని దేశ ప్రయోజనాల దృష్ట్యా ఒక ముఖ్య పరిణామంగా అభివర్ణించారు. ఇది కేవలం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు. దేశ సమగ్రతను కాపాడటంలో ఈ పరిణామం కీలకమైందని అన్నారు.ఎన్డీయే ప్రభుత్వం మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలు చేసి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకోవడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర కీలకమైందని తెలిపారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నించడం ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో ఎలాంటి అడ్డంకులు లేవని, చిన్న సవరణలతో వెంటనే అమలు చేయవచ్చని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా రిజర్వేషన్లు ఉండాలని డిమాండ్ చేశారు. ఇది సమగ్ర సామాజిక న్యాయానికి అవసరమని పేర్కొన్నారు.బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచి శాశ్వత అధికారాన్ని కైవసం చేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ విధానం ప్రజాస్వామ్యానికి ముప్పు అని వ్యాఖ్యానించారు.సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే ప్రవేశపెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇస్తుందని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కనబెట్టి కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సాధికారత కాంగ్రెస్ సిద్ధాంతాల్లో ప్రధాన భాగమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ వంటి నాయకత్వం దేశానికి మార్గదర్శకమైందని గుర్తుచేశారు. బీజేపీ నుంచి ఇప్పటివరకు మహిళా అధ్యక్షురాలు లేకపోవడం వారి మహిళా దృక్పథాన్ని చూపిస్తుందని విమర్శించారు.దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, చట్టసభల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం సమాజ పురోగతికి అవసరమని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు దేశ రాజకీయాల్లో ఒక చారిత్రక అడుగు అవుతుందని పేర్కొన్నారు.దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడుతూ, సమాన అవకాశాలు కల్పించే విధంగా కేంద్రం ముందుకు రావాలని ఆయన కోరారు. దేశ సమగ్రత, సమాన అభివృద్ధి లక్ష్యంగా అన్ని నిర్ణయాలు ఉండాలని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.




## రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు

- క్రాస్ బ్రీడ్ బంధం" వ్యాఖ్యలు
- బీజేపీతో సంబంధాలపై ఆరోపణలు
- ఢిల్లీ ఘటనను ప్రస్తావించిన మాజీ మంత్రి
- కాంగ్రెస్ నాయకత్వంపై ప్రశ్నలు



హైదరాబాద్, ఏప్రిల్ 18 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ విధానాన్ని "హైబ్రిడ్ మోడల్ కాదు, కేంద్రంలోని బీజేపీ పెద్దలతో కుదుర్చుకున్న క్రాస్ బ్రీడ్ బంధం"గా ఆయన వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిచ్చిన సమయంలో, రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి ఇంటికి వెళ్లి భోజనం చేయడం అనుమానాలకు తావిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. ఈ చర్య రాజకీయంగా విరుద్ధ సంకేతాలు ఇస్తోందని అన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు ఈ పరిణామాలు తెలుసా? అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా జరిగే చర్యలపై వారు స్పందిస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు స్పష్టత లేవని, ప్రజలకు భిన్న సంకేతాలు వెళు తున్నాయని హరీష్ రావు విమర్శించారు. రాజకీయంగా పారదర్శకత అవసరమని, ప్రజలకు నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు.ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్‌కాంగ్రెస్ మధ్య విమర్శల యుద్ధం మరింత తీవ్రతరం అవుతున్నదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి